www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 6 జూన్ 2023
5
తిరుపతి



ఘాట్‌రోడ్డు డ్రైవింగ్‌పై కరపత్రం విడుదల

ప్రజాశక్తి- తిరపతి సిటి: తిరుపతి-తిరుమల మధ్య ఘాట్ రోడ్డులో ప్రయాణించే ఆర్‌టిసి బస్సు డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా ప్రజారవాణా సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను జిల్లా ప్రజారవాణాధికారి టి.చెంగల్ రెడ్డి విడుదల చేశారు. స్థానిక ఆర్‌టిసి ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో 348 సప్తగిరి బస్సులతో నిత్యం 1600 ట్రిప్‌లు తిప్పుతూ, సుమారు 80వేల మంది భక్తులను ప్రతి రోజూ తిరుపతి- తిరుమల మధ్య చేరవేస్తున్నామని తెలిపారు. ఈ మధ్య కాలంలో తిరుమల కనుమ దారుల్లో రోజూ జీపులు, కార్లు, టెంపోలు ప్రమాదాలు జరుగుతుండటం, గత నెలలో ఎలక్ట్రిక్ బస్సుకు ప్రమాదం జరిగిన నేపథ్యంలో ఘాట్‌రోడ్డులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కరపత్రం రూపొందించామన్నారు. డిప్యూటీ సిటిఎం బాస్కర్, జి.నరసింహులు పాల్గొన్నారు.

స్పృహ తప్పి పడి గాయపడిన వృద్ధురాలు

భూములు పోయే.. పరిహారం రాదాయే..

కలెక్టరేట్ ఎదుట బాధిత రైతుల గోడు

స్పృహ తప్పిన వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'అయ్యా... జగనన్న కాలనీల పేరుతో గతేడాది 130 ఎకరాలు తీసుకున్నారు.. 15.50 లక్షల నగదు, మూడు సెంట్లు స్థలం చొప్పున ఇస్తామని చెప్పారు.. కేవలం 20 మంది రైతులకే ఇచ్చారు.. ఇంకా 60 మంది రైతులకు ఇవ్వాల్సి ఉంది.. అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయాం.. కాళ్ల చెప్పులు అరిగాయే తప్ప పరిహారం మాత్రం ఇవ్వలేదు.. అలిసిపోయాం.. కనికరించి ఆదుకోండి..' ఇది తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం పాగాలిలో భూములు కోల్పోయిన నిర్వాసిత బాధిత రైతుల గోడు.

ఏర్పేడు మండలం పాగాలి రెవెన్యూ లెక్కదాఖలాలో జగనన్న కాలనీ నిర్మాణానికి వైసిపి ప్రభుత్వం గతేడాది 130 ఎకరాలను సేకరించింది. ఫలితంగా పాగాలి, మేర్లపాక, కుమ్మరిగుంట గ్రామాలకు చెందిన 80 మంది రైతులు నిర్వాసితులయ్యారు. ప్రతి రైతు కుటుంబానికీ ఎకరాకు రూ.15.50 లక్షల నగదు, మూడు సెంట్ల స్థలం ఇస్తామని అధికారులు గ్రామసభలు పెట్టి మరీ ఒప్పందం చేసుకున్నారు. అయితే ఒప్పందం చేసుకుని రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికి కేవలం 20 మంది రైతులకు మాత్రమే ఎకరాకు రూ.15,50 లక్షల చొప్పున పరిహారం అందించారు. మిగిలిన రైతులు 'మా డబ్బు మాకివ్వండి మమాప్రభో' అంటూ అధికారుల చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయారు. పడిగాపులు కాస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం 'స్పందన' కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌కు బాధితులంతా వెళ్లారు. ఈ ఘటనలో ఓ వృద్ధురాలు స్పృహ తప్పి పడిపోయింది. ఆమె తలకు గాయాలయ్యాయి. 'ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయాం.. కనికరించి ఆదుకోండి' అని కాళ్లావేళ్లా పడుతూనే ఉన్నారు. భూములు పోగొట్టుకుని, పరిహారం రాక, ఏం చేయాలో దిక్కుతోచక ఉన్నామని వారు వాపోతున్నారు.

అంతా పేద రైతులే..

'పులిని చూసి నక్క వాత పెట్టుకోవడం' అన్న సామెత అచ్చు పాగాలి రైతులకు సరిపోతుందేమో పాపం. పరిహారం డబ్బులొస్తాయని ముందే అప్పులు చేసి పీకల్లోతు కష్టాల్లోకి కూరుకుపోయారు కొందరు పేద రైతులు. తమతోటి రైతులకు పరిహారం అందడం..! అధికారులు రేపో మాపో అంటూ ఊరించడమే అందుకు కారణం. మేర్లపాక, కుమ్మరిగుంట, పాగాలి గ్రామాల్లో కొందరు రైతులు అధికారుల మాటలు నమ్మి ఈ రెండేళ్లలో శుభకార్యాల కోసం రూ.5 నుంచి రూ. 6 లక్షల వరకు అప్పులు చేసినట్లు వాపోతున్నారు. దీంతో అప్పులోళ్ళు రోజూ ఇబ్బంది పెడుతున్నారనీ, కొందరు ఇళ్ళు జప్తు చేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఏర్పేడు మండల జగనన్న కాలనీ నిర్మాణాలకు భూములు కోల్పోయిన బాధిత రైతులకు సత్వరమే పరిహారం అందించేలా చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పైన కూరగాయలు.. కింద గంజాయి..!

- రూ.48 లక్షల విలువైన 250 కిలోలు స్వాధీనం - అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠా అరెస్టు

ప్రజాశక్తి - తిరుపతి సిటి, సూళ్లూరుపేట

గంజాయిని అక్రమ రవాణా చేసే అంతర్జాతీయ ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 48 లక్షల రూపాయల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్‌పి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు ... సూళ్లూరుపేట పోలీసులు సూళ్లురుపేట హోళీ క్రాస్ వద్ద తనిఖీలు చేపట్టారు. నెల్లూరు నుంచి వస్తున్న ఓ బొలేరో వాహనాన్ని అనుమానాస్పదంగా ఆపి తనిఖీలు చేశారు. పైన కూరగాయలు, లోపల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. అందులో 240 కేజీల బరువుగల 120 ప్యాకెట్లు గంజాయి ఉండడాన్ని పసిగట్టారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న తమిళనాడుకు చెందిన ఆనందవేలు(48), బాలకిషన్ (60), తిరుమల (38), రఘునాథన్ (41), వరదరాజన్ (37), డి.లవ్‌రాజు (28), కె.వెంకటరమణ (25), బి.రవి (41) అరెస్టు చేయగా, అనకాపల్లికి చెందిన అప్పలనాయుడు, శ్రీలంకకు దేశస్తుడు ఖాదర్‌భాయి పరారీలో ఉన్నారన్నారు. వీరి వద్ద నుంచి 48 లక్షల రూపాయల విలువ కలిగిన 240 గంజాయి, 5 సెల్ ఫోన్స్, బొలెరో ట్రక్, ఇన్నోవా వాహనము స్వాధీనం చేసుకున్నారు. వెంటనే అప్రమత్తమైన తమ సిబ్బంది వారిని విచారిస్తుండగా సదరు బొలెరో ట్రక్ వాహనానికి పైలట్‌గా వెళుతున్న ఇన్నోవా కారును గుర్తించి, ఎంతో చాకచక్యంగా స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని విచారించగా గంజాయిని అనకాపల్లిలోని అప్పల నాయుడు (పరారీలో ఉన్న ముద్దాయి) వద్ద 1. ఆనంద వేలు కొనుగోలు చేసి, సదరు గంజాయిని మన రాష్ట్రం నుండి తమిళనాడు మీదుగా శ్రీలంక దేశానికి చెందిన ఖాదర్ భాయ్ (పరారీలో ఉన్న ముద్దాయి)కి తమిళనాడు నందలి కోస్టల్ ఏరియాలు అయిన చెన్నై, రామేశ్వరం వద్ద గల ధనుస్‌కోటి, వేలాంగిని, నాగపట్నం, తుత్తుకుడి, తిరుచందూర్ నుండి చిన్న చిన్న పడవల ద్వారా శ్రీలంక దేశానికి ఎగుమతి చేస్తున్నట్లు వెల్లడించారు. వీరు లావాదేవీలను గంజాయికి బదులుగా బంగారాన్ని డబ్బుకు బదులుగా మార్చుకునేవారని, ఈ విధంగా సులభంగా డబ్బులు సంపాదించుటకు అలవాటు పడిన ఆనంద వేలు తనకంటూ ఒక ముఠాను ఏర్పరచుకొని ఈ స్మగ్లింగ్ వ్యాపారానికి తరచుగా పాల్పడుతున్నట్లు తమ ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేసి, రిమాండుకు తరలిస్తున్నామన్నారు. ముద్దాయిలు అరెస్టు, సొత్తు స్వాధీనానికి సహకరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. సబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర, నాయుడుపేట డిఎస్పి రాజగోపాల్ రెడ్డి, సూళ్లూరుపేట సిఐ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ఐలు సులూరుపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న గంజాయిని మీడియాకు చూపుతున్న జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి

మెటర్నిటీలో బాలుడు అపహరణ

గంటలో కేసును ఛేదించిన పోలీసులు

తల్లిదండ్రులకు బిడ్డ అప్పగింత

ప్రజాశక్తి-తిరుపతి సిటి: తిరుపతి ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలో ఐదురోజుల వయస్సుగల ఓ బాలుడు అపహరణకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేవలం గంటలోనే కేసును ఛేదించి, బిడ్డను తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... నాగలాపురం మండలం ఈస్ట్ హరిజనవాడకు చెందిన షణ్ముగం లత (25), పిచ్చాటూరు మండలం గోవర్ధనగిరికి చెందిన వెట్టి.సుమన్ (24) భార్యభర్తలు. లత ఇటీవల గర్భం దాల్చింది. కొన్ని నెలల తర్వాత అబార్షన్ అయ్యింది. దీంతో తనకు పిల్లలు పుట్టరని భావించి, భర్త సుమన్‌తో కలిసి పిల్లవాడిని కిడ్నాప్‌చేసి పెంచుకోవాలని అనుకున్నారు. సోమవారం ఉదయం తిరుపతి ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలోకి ప్రవేశించి, నిద్రిస్తున్న తల్లి వద్దనుంచి 5 రోజుల వయస్సు గల బాలుడిని చాకచాక్యంగా అపహరించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆసుపత్రి వైద్యులతో కలిసి వెస్టు పోలీసులను సంప్రదించారు. తిరుపతి డిఎస్‌పి సురేంద్రరెడ్డి సూచనలతో పోలీసులు వెనువెంటనే బృందాలుగా ఏర్పడి తనిఖీలు ప్రారంభించారు. వెస్ట్ సిఐ శివప్రసాద్ పర్యవేక్షణలో సాంకేతికతను అందిపుచ్చుకుని ఎస్ఐ ఓలయ్య, తన సిబ్బందితో అలిపిరి రోడ్డు వివేకానంద సర్కిల్ వద్ద తచ్చాడుతున్న నిందితులను పసిగట్టి, వారి వద్దనుంచి బాలుడిని క్షేమంగా కాపాడారు. అనంతరం బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో బాలుని తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. బాలుడు అపహరణ కేసుపై వెంటనే స్పందించి, చాకచాక్యంగా గంటలోపే చేదించి, తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులను ఎస్‌పి పరమేశ్వరరెడ్డి అభినందించారు.

టపాసుల పేలుళ్లలో మరో ప్రాణం బలి

ప్రజాశక్తి - వరదయ్యపాళెం

తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం ఎల్లకట్టవ గ్రామంలో టపాసుల తయారీ కేంద్రంలో గత బుధవారం పేలుడు సంభవించి ముగ్గురు మృతిచెందిన విషయం విదితమే. ఈ ఘటనలోనే తీవ్రంగా గాయపడిన వాలంటీర్ కల్యాణ్, వీరరాఘవయ్యలను చెన్నయ్‌లోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. ఈ క్రమంలో సోమవారం వేకువజామున కల్యాణ్ మృతిచెందినట్లు వైద్యులు కుటుంబసభ్యులకు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వాలంటీర్ కల్యాణ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుని కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని సత్యవేడు ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం హామీ ఇచ్చారు. అధికారులతో మాట్లాడి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. తక్షణ సాయం కింద పదివేల రూపాయలను అందించినట్లు తెలిపారు.

మృతి చెందిన కల్యాణ్

ఎస్వీయూ, పశువైద్య వర్సిటీలకు

ఉత్తమ ర్యాంకులు

ప్రజాశక్తి - క్యాంపస్

దేశంలో బోధన పరిశోధన రంగాల్లో ఉత్తమ ర్యాంకును విడుదల చేసే ఎన్ ఐ ఆర్ ఎఫ్ వారు విడుదల చేసిన ర్యాంకులలో ఓవరాల్ అగ్రికల్చరల్ విశ్వవిద్యాలయాల్లో శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం 31వ ర్యాంకును సాధించిందని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వి పద్మనాభరెడ్డి వెల్లడించారు. దేశంలో ఉన్నటువంటి పశు వైద్య విశ్వవిద్యాలయాల్లో శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విషయాలయం నాల్గవ ర్యాంకులో నిలిచిందన్నారు. గత సంవత్సరం ఐకార్ న్యూఢిల్లీ వారు విడుదల చేసిన ర్యాంకింగ్స్ లలో శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విషయం విద్యాలయమునకు 2020 సంవత్సరంలో 64వ ర్యాంకు, 2021 లో 57 వ ర్యాంక్, వెటర్నరీ యూనివర్సిటీ విభాగంలో ఏడవ ర్యాంకును 2021లో, 2023 లో 4వ స్థానం సాధించిందని గుర్తు చేశారు. విశ్వవిద్యాలయం జాతీయస్థాయిలో ఉన్నత ర్యాంకు సాధించడం పట్ల వర్సిటీ అధికారులను, టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ పి. జగపతి రామయ్యను, బోధన సిబ్బందిని, బోధనేతర సిబ్బందిని ఉప కులపతి ఆచార్య వి. పద్మనాభరెడ్డి అభినందించారు.

ఎస్వీయూలో... కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని మానవనరుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ప్రకటించబడిన యన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్) ర్యాంకింగ్ ల్లో విశ్వవిద్యాలయాల విభాగంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం 2023 వ సంవత్సరానికి 60వ ర్యాంక్ సొంతం చేసుకుందని, ఇంజనీరింగ్ కళాశాలల ప్రగతిలో 151-200 స్థానం సాధించిందని ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి తెలిపారు. గత సంవత్సరం 67 వ ర్యాంకు పొందిన ఎస్వీయూ, ఈ సంవత్సరం ఇంకా మంచి ర్యాంకు పొందడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ కాలేజీల విభాగంలో 2022లో 251-300 స్థానం పొందిన ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజి తన స్థానం మెరుగుపరచుకోవడం ఆనందంగా వుందన్నారు. ర్యాంకులు సాధించడం పట్ల రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బందిని అభినందించారు.

పర్యావరణ హితం ..భవిష్యత్ పథం

జిల్లావ్యాప్తంగా ప్రచార ర్యాలీలు

ప్రజాశక్తి - తిరుమల, యంత్రాంగం

'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ప్రచార ర్యాలీలు జరిగాయి. తిరుమలలో భక్తులకు మరింత ఆహ్లాదకర ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించేందుకు అడవులను దేశంలోనే అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. స్పెషల్‌టైప్ కాలేజీల వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తిరుమల క్షేత్రాన్ని కాలుష్యరహిత క్షేత్రంగా తీర్చిదిద్దాలన్నారు. టిటిడి అటవీ విభాగం ఆధ్వర్యంలో రెండువేల మొక్కలు నాటిపర్యవేక్షించనున్నట్లు చెప్పారు. ఇందులో ఫైకాస్ డల్హౌసి అనే రావి, మర్రి జాతికి చెందిన వక్షాలు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ శ్రీనివాసులు, ఈఈ -1 జగన్మోహన్ రెడ్డి, ఈఈ (ఎఫ్ ఎం ఎస్) శ్రీనివాసరావు, డిప్యూటీవో ఆర్2 భాస్కర్, ఎఫ్ ఆర్ ఓ లు వెంకటసుబ్బయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తిరుపతిలో అవగాహన ర్యాలీ

ప్రపంచ పర్యావరణను పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ హరినాథ్, డాక్టర్ కిరణ్‌నాయక్, డాక్టర్ రూప్‌కుమార్, డాక్టర్ చక్రపాణి పాల్గొన్నారు.

తిరుపతి టౌన్ : పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా కంకణబద్ధులు కావాలని మేయర్ డాక్టర్ శిరీష పిలుపునిచ్చారు. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. విద్యుత్ వాహనాల వినియోగం ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. గతేడాది స్వచ్ఛ సర్వేక్షన్‌లో తిరుపతి దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. తిరుపతి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో కమిషనర్ హరిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బసవ గీత, నారాయణ, అదనపు కమిషనర్ సునీత పాల్గొన్నారు.

తిరుపతిలో ప్రతిజ్ఞ చేస్తూ..

తిరుపతి సిటి : జేసీ డికె బాలాజీ, అడిషనల్ ఎస్‌పి కులశేఖర్ ఆధ్వర్యంలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి జెండా ఊపి సోమవారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. రామచంద్ర పుష్కరిణి చేరుకుని అక్కడ కళావేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరచిన పలు పాఠశాలల విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇఇ నరేంద్ర, ఎన్‌సిసి 29 ఆంధ్ర బెటాలియన్ కల్నల్ శివరాజ్, వీరభద్రం, రీజినల్ సైన్స్ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ పాల్గొన్నారు.

జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ యు.శ్రీహరి ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది.

తిరుపతి (మంగళం) : తిరుపతి-కరకంబాడీ మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సేవ విభాగం, ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు "సొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్" అనే అంశంపై పోస్టర్ ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవిందుకుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జయచంద్ర, జాతీయ సేవ విభాగం ఆఫీసర్ ఎస్.చక్రి శ్రీధర్, ఐఐసి. కోఆర్డినేటర్ జమీలా విద్యార్థులు పాల్గొన్నారు.

వరదయ్యపాలెం శ్రీసిటిలో..

ప్లాస్టిక్‌రహిత సమాజాన్ని స్థాపించేందుకు అందరూ కంకణబద్దులు కావాలని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని ఎస్వీసిఈ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ సేవా పథకం, కళాశాల ఆవిష్కరణ విభాగం ఆధ్వర్యంలో ' ప్లాస్టిక్ వ్యర్థాలు- పర్యావరణ పరిరక్షణ ' అనే అంశంపై విద్యార్థులకు వకత్వపు పోటీలను నిర్వహించారు. విద్యార్థులతో కలిసి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆవిష్కరణ విభాగం కన్వీనర్ డాక్టర్ కె. సుధీర్, జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ టి.చంద్రయ్య, డాక్టర్ కె. సుజన్ కుమార్ పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్ ఆధ్వర్యంలో అలిపిరి కూడలి నుంచి కపిలతీర్థం నంది కూడలి వరకూ మూడు కిలోమీటర్ల 'వాక్‌థాన్' నిర్వహించారు.

క్యాంపస్‌లో.. : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ బ్యూరో, బోర్డు ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆల్టరేటివ్స్ టు సింగిల్ యూజ్‌ప్లాస్టిక్స్ అనే అంశంపై వెబినార్ జరిగింది. వాటర్ ఆడిట్ విభాగ మాజీ డైరెక్టర్ డాక్టర్ వేణుగోపాల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ విద్యావతి, బిసిడిఇ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కాత్యాయని, డాక్టర్ శ్రీరజిని పాల్గొన్నారు. జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో ఉప కులపతి ఆచార్య జివిఎస్ఆర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగింది. రిజిస్ట్రార్‌చ ల్లా వెంకటేశ్వర్లు, అకడమిక్ డీన్ ఆచార్య టివి రాఘవాచార్యులు పాల్గొన్నారు.

బిఎన్‌కండ్రిగలో... లక్ష్మీపురం గిరిజన కాలనీలో ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో చైతన్యశిఖరం నిర్వహించారు. ప్రజాప్రగతి కోఆర్డినేటర్ ఎ.సుబ్రమణ్యం మాట్లాడుతూ వాతావరణం పూర్తిగా కాలుష్యంగా మారిందన్నారు. పుట్టుకతోనే అనేక జబ్బులు వస్తున్నాయన్నారు. నివారణకు చెట్లను పెంచడమే శరణ్యమన్నారు. క్లస్టర్ కోఆర్డినేటర్లు జి.ఓంకార్, ఎ.సురేష్ పాల్గొన్నారు.

సత్యవేడులో.. : పర్యావరణ హిత ప్రమాణాలతో స్థిరమైన అభివృద్ధి దిశగా పయనిస్తున్న శ్రీసిటీలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. సత్యవేడు అటవీ శాఖ రేంజి అధికారి జి.జయప్రసాదరావు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. మియావాకి పద్ధతి ఐదో దశలో స్థానిక జాతులకు చెందిన దాదాపు 24వేల మొక్కలను నాటేందుకు శ్రీకారం చుట్టారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ 'రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్' విధానం ఎంతో అనువైనదన్నారు. శ్రీసిటీ హార్టికల్చర్ ల్యాండ్ స్కేపింగ్ విభాగం హెడ్ మధుసూదన్‌రెడ్డి, నోవా ఎయిర్ పరిశ్రమ సీనియర్ ప్లాంట్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తడలో.. : బీమునివారిపాలెం గ్రామంలో మడచెట్లు నాటే కార్యక్రమానికి తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి హాజరయ్యారు. ఏరులు, వాగులకు ఇరువైపులా చెట్ల పెంపకం జరుగుతుందన్నారు. గూడూరు నియోజకవర్గం రాయదొరువు వద్ద పులికాట్ సరస్సు ముఖద్వారం వద్ద పూడిక తొలగించే కార్యక్రమం త్వరలోనే ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తడ ఎంపిపి కోళవి రఘురెడ్డి, తడ బిసి సెల్ అధ్యక్షులు మునస్వామిరెడ్డి, తడ సర్పంచి ఆర్ముగం పాల్గొన్నారు.

జూట్ బ్యాగులను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, మేయర్ శిరీషా



టిటిటి ఆధ్వర్యంలో ఈవో

హామీల అమలే లక్ష్యం

శ్రీకాళహస్తికి చేరుకున్న రాష్ట్ర జాతా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి / గూడూరు టౌన్

పాదయాత్ర సందర్భంగా మున్సిపల్ కార్మికులకు అప్పటి ప్రతిపక్ష నేత, ఇప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ కార్మికుల ప్రచార జాత విజయవాడ నుంచి సోమవారం శ్రీకాళహస్తి పట్టణానికి చేరుకుంది. ఈ సదర్భంగా రాష్ట్ర నాయకులు శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ ఆరోగ్య, జీవిత బీమా సౌకర్యాలు, కార్మికుల క్రమబద్ధీకరణ తదితర అంశాల సాధనకు జగన్ ప్రభుత్వం చొరవ చూపలేదని మున్సిపల్ కార్మికుల రాష్ట్ర కార్యదర్శి నాగేంద్రబాబు మండిపడ్డారు. జగన్ మెడలు వంచి మున్సిపల్ కార్మికుల హక్కులను సాధించుకోవడంలో జాతా ముందుకు నడుస్తుందని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు గోపి, జాన్, హరి, జాషువా, అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, గంధం మణి, కుమార, ఈశ్వరయ్య, వెలివేంద్రం తదితరులు పాల్గొన్నారు.

నేడు గూడూరుకు రాష్ట్ర ప్రచార జాతా

సి.ఐ.టి.యు రాష్ట్ర కమిటి పిలుపు మేరకు రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్ ల్లో ,పనిచేస్తున్న కార్మికులు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మే నెల 31వ తేదీన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుండి ఏ.పి. మున్సిపల్ అండ్ వర్కర్స్ యూనియన్ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వర రావు నాయకత్వంలో ఒక ప్రచార జాతా ప్రారంభమయ్యింది. అదేవిధంగా ఏ.పి. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం నాయకత్వం లో రెండో ప్రచార జాతాను హిందూపురం నుండి బయలుదేరింది. తిరుపతి మీదుగా మంగళవారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ కు చేరుకుంటుందని తెలిపారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, పట్టణ ప్రజలు, అభిమానులు ,కార్యకర్తలు, ప్రతి ఒక్కరు హాజరై ఈ ప్రచార జీపు జాతాను విజయవంతం చేయాలని నాయకులు, జిల్లా కార్యదర్శి బి. గోపీనాథ్ ,పట్టణ కార్యదర్శి కోటి ,కమిటీ సభ్యులు బి. ప్రసాద్, బి. మురళి ,మహేంద్ర ,టి. రాఘవయ్య, తదితరులు పేర్కొన్నారు.

పిసి రాయులుకు ఘన సన్మానం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రముఖ పారిశ్రామికవేత్త, కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి సి రాయులు.కి రాష్ట్రస్థాయి దిశ రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయతీరాజ్ కమిటీ మెంబర్గా నియమితులైన సందర్భంగా కపిల తీర్థం సమీపంలోని హెటల్లో ఆదివారం రాత్రి గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ పార్లమెంటు సభ్యులు, ఎన్నారై కి సంబంధించి ప్రస్తుత ప్రభుత్వ సలహాదారులు జ్ఞానేంద్ర రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి , పి రామచంద్రారెడ్డి , ఎం వేణుగోపాల్ రెడ్డి , రెడ్డి వారి ప్రభాకర్ రెడ్డి , శేషగిరి రావు గుండాల గోపీనాథ్ అజయ్ కుమార్ , రుద్రరాజు శ్రీదేవి హాజరయ్యారు. తిరుపతి ఫిల్మ్ సొసైటీ, జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్, రాయలసీమ రంగస్థలి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, హ్యూమన్ రైట్స్, బ్రాహ్మణ సమాజం, అభినయ ఆర్ట్స్, పి సి ఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్, కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్, డాక్టర్ వైఎస్ఆర్ ప్రజాప్రస్థానం సేవా ట్రస్ట్, గవర్నమెంట్ డాక్టర్ అసోసియేషన్ తదితర సంస్థల ప్రతినిధుల బందం డాక్టర్ పి సి రాయల్ కి అత్యంత ఘనంగా సన్మానం చేసి వారి నిరంతర సేవలను కొనియాడారు.

ఉక్కపోతతో ప్రజల కష్టాలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో భానుడు భగభగలతో ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ప్రజలు, గర్భిణులు, స్త్రీలు, వద్ధులు, చిన్నపిల్లలు అవస్థలు పడుతున్నారు. గత మూడు రోజులుగా భారీగా నమోదవుతున్న ఉష్ణోగ్రత 43 శాతం కంటే ఎక్కువ ఎండలు కాయడంతో మండల ప్రజలు కొంత అస్తవ్యస్తకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఉష్ణోగ్రత తీవ్రత కంటే మూడు రోజులు మరింత ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుందని ఉష్ణోగ్రతల విపత్తుల శాఖ వెల్లడించడంతో భయాందోళనలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాయంకాలం ఆరుగంటల వరకు వేడి సెగలు విపరీతంగా రావడంతో తట్టుకునే పరిస్థితి లేక చెట్లనీడకు పరుగులు తీస్తున్నారు. దీనికి తోడు మండలంలో విద్యుత్ అంతరాయం ఎక్కువ కావడంతో తట్టుకోలేని పరిస్థితుల్లో గ్రామీణ ప్రజలు సతమతమవుతున్నారు. మూగజీవాలు ఎండవేడికి తట్టుకోలేక చెట్ల కిందకి నీరు ఉన్నచోటకు పరుగులు పెడుతూ సేద తీర్చుకుంటున్నాయి. వరుణుడు దయతలచి కరుణించి వర్షాలు కురిస్తే భూమి చల్లబడి ప్రజలు ఊపిరి పీల్చుకుంటారు.

నిరుపేదలకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు: స్థానిక డీఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో నిరుపేదలకు గూడూరు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో 'రోటరీ చేయూత' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఫల సరుకులు పంపిణీ చేశారు. రొటేరియన్ శ్రీనివాసులునాయుడు మనవడు వెంకట దేవాన్ష్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన నిరుపేదలకు నెలకు సరిపడా సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రొటేరియన్ విజయభాస్కర్‌రెడ్డి, బలరాం రెడ్డి, సుధాకర్, వాసు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల్లో పేర్లు నమోదుకు అవకాశం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీలలో రేషన్ కార్డులను వివిధ కారణాలతో తొలగించిన వారికి.. అలాగే రేషన్ కార్డులో పేరు లేని వారికి కొత్తగా వారి పేర్లు నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని.. ఈ అవకాశాన్ని మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు హనుమాన్ నాయక్ తెలిపారు. అలాగే ఒంటరి మహిళలు, ఒంటరి వ్యక్తులు సైతం వేరుగా రేషన్ కార్డు నమోదు చేసుకునేందుకు సచివాలయాల్లో అవకాశాన్ని కల్పించారని పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రెవెన్యూ సమస్యలకు తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: రెవెన్యూ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని తహశీల్దారు హనుమాన్‌నాయక్ సూచించారు. సోమవారం ఉదయం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28 పంచాయతీలలో రెవెన్యూ వీఆర్వోలు సకాలంలో వారి పంచాయతీ సచివాలయాలకు హాజరై అర్జీదారుల సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని.. సమస్యపై తనకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే వారిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సిబ్బం దిపై ఫిర్యాదు వచ్చినా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు శివయ్య, సీనియర్ అసిస్టెంట్ నాగార్జునరెడ్డి, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపురంలో పారిశుద్ధ్యానికే ప్రాధాన్యత



ప్రజాశక్తి-పుత్తూరు రూరల్: రామకృష్ణాపురం పంచాయతీ పరిధిలో ప్రధానంగా పారిశుద్ధ్యం, తాగునీటి వసతి, విద్యుత్తు దీపాల వెలుగులపైనే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని.. సర్పంచ్ విరిత దేవేంద్రరెడ్డి తెలిపారు. సోమవారం సచివాలయంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సర్పంచ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ పంచాయతీలో కొత్త వీధిదీపాలను ఎప్పటికప్పుడు వేయిస్తున్నామని.. ప్రధానంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక నిఘా ఉంచి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. గ్రామంలో ఎక్కడబడితే అక్కడ చెత్తాచెదారం పడేయకుండా పంచాయతీ గ్రీన్ అంబాసిడర్ల వద్దనే పొడి, తడి చెత్తను వేర్వేరుగా అందించాలని సూచించారు. ఎక్కడబడితే అక్కడ చెత్తను పడేసే వారిని గుర్తించి మొదటిసారిగా వారికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల్లో సర్పంచ్ ఆధ్వర్యంలో పిచ్చిమొక్కల తొలగింపు, పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మునినరేష్‌కుమార్, వైసీపీ యువ నాయకుడు దేవేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, పంచాయతీ అధికారులు, వాలంటీర్లు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

వెంకటరమణరెడ్డిపై హత్యాయత్నం దారుణం

ప్రజాశక్తి -గూడూరు: గూడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. నెల్లూరులో రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను, ప్రభుత్వ అధినేతల అవినీతిని ఎప్పటికప్పుడు సాక్ష్యాధారాలతో ఎండగడుతూ ప్రజల్లోకి తీసుకెళుతున్న రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డిని హత్య చేయడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే చంపేస్తారా? అని ప్రశ్నించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసరావు, తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి బిల్లు చెంచు రామయ్య, తిరుపతి పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు తాతపూడి ఇశ్రాయేల్ కుమార్, తెలుగు యువత నాయకులు వేముల సునీల్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా... నిర్లక్ష్యం..!

తీరుమారని విద్యుత్తు శాఖ ● మరమ్మతుల్లో తీవ్ర జాప్యం
నిలువునా ఎండుతున్న పంటలు ● గుండెలు బాదుకుంటున్న గిరిజన రైతు

ప్రజాశక్తి-తొట్టంబేడు

ఎస్పీడీసీఎల్ అధికారుల తీరు నానాటికీ తీసికట్టుగా మారుతోంది. అక్కడి అధికారుల తీరుపై ఎన్ని ఆరోపణలు, విమర్శలు వస్తున్నా మార్పు మాత్రం రావడం లేదు. విద్యుత్ సమస్యలను అధిగమించడంలోనూ.. సకాలంలో మరమ్మతులు పూర్తి చేయడంలోనూ నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు పెచ్చుమీరుతున్నాయి. గత కొద్ది రోజుల క్రితం మండలంలోని చియ్యవరం, చేమూరు గ్రామాలలో రైతులు పొద్దున్నే లేచి పొలం వద్దకు వెళ్లి మోటారు కరెంటు వచ్చే సమయానికి మోటార్ వేశారు. అయితే మోటర్ వేసిన పది నిమిషాలకే మోటార్లు కాలిపోతుండటం గమనార్హం. ఒక్కసారిగా అధిక కరెంట్ రావడంతో మోటార్లు కాలిపోతున్నాయి. సుమారు ఆ గ్రామాలలో 20కి పైగా మోటార్లు కాలిపోయాయి. దీంతో రైతులు సాగు నీటి కోసం నానా అవస్థలు పడ్డారు. వర్షాలకు, ఈదురు గాలులకు విద్యుత్తు లైన్లు మరమ్మతులకు గురైతే ఇక విద్యుత్ అధికారుల చుట్టూ రైతులు కాళుఅరిగేలా తిరగాల్సిందే. రైతులకు నరకం చూపిస్తున్నారని వాపోతున్నారు. అప్పు..సప్పుచేసి వరినాట్లు నాటితే కళ్లముందే పైరు ఎండిపోతున్నా ఏమి చేయలేని పరిస్థితి నెలకొందని రైతులు లబోదిబోమంటున్నారు. వేలకు వేలు అప్పులు చేసి పంటను సాగు చేస్తే విద్యుత్ సమస్య వస్తే ఆ పంటను వదిలేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోందని రైతులు వాపోతున్నారు.

ఎండిన మూడెకరాల పొలం

మండలంలోని పూడి పంచాయతీ జూగుంటలో గిరిజన కాలనీకి చెందిన సింహంశెట్టి వెంకటయ్య రైతు పొలంలో విద్యుత్ స్తంభాలు కూలిపోయి వారమవుతున్నా పట్టించుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. గత కొద్దిరోజుల క్రితం కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆ స్తంభాలు పడిపోయినప్పటి నుంచి విద్యుత్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. దీని ఫలితంగా మూడు ఎకరాల పొలం పూర్తిగా ఎండిపోయింది. ఈ విద్యుత్తు లైన్ల కింద మూడు సర్వీస్‌లు ఉన్నాయి. సర్వీసులు ఉన్నప్పటికీ విద్యుత్ అధికారులు పట్టించుకోకుండా నిమ్మకునీరొత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

గిరిజనుడని విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం

నిరుపేద గిరిజన రైతులు కాబట్టి విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యుత్తు స్తంభాలు పడిపోయాయని అధికారులుకు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. రెక్కాడితే కానీ డొక్కాడని గిరిజన రైతు వ్యవసాయం చేస్తే మూడు ఎకరాల పంట మొత్తం ఎండిపోయింది. అప్పు చేసి పంట సాగు చేపట్టాను. అప్పు ఎలా తీర్చేది దేవుడా. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం చేయాలి.

- సింహంశెట్టి వెంకటయ్య, రైతు, జూగుంట తొట్టంబేడు మండలం

ఇందిరమ్మ ఇళ్లకు దారి చూపాలి

ప్రజాశక్తి -రేణిగుంట: గుత్తివారిపల్లిలోని గిరిజనుల ఇళ్లకు దారి చూపాలని, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. హరినాథ్ డిమాండ్ చేశారు. సోమవారం గుత్తివారిపల్లి గ్రామానికి 'గిరిజన సంఘం బందం' పర్యటించి దారి సమస్య విషయాన్ని విచారించారు. దౌర్జన్యంగా గిరిజనుల ఆత్మగౌరవం దెబ్బతినేలా కులం పేరుతో దూషించి, గిరిజన ఇందిరమ్మ ఇళ్లకు సీసీ రోడ్డు నిర్మాణం అడ్డుకుంటున్న గొల్లపల్లి రంగారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని రేణిగుంట డీఎస్పీ, సీఐ, మండల తహశీల్దార్లను కోరారు. లేనిపక్షంలో ప్రభుత్వ కార్యాలయం, పోలీస్ స్టేషన్ వద్ద నిరసనకు దిగుతామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం నాయకులు గుణ, గురవయ్య, ధరణి, చీరాలమ్మ, గిరిజనులు చీరాలయ్య, గురవయ్య పాల్గొన్నారు.

ఘనంగా జూలియన్ రాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట పట్టణంలో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు 67వ జన్మదిన వేడుకలు ఘనంగా సోమవారం జరిగాయి. ఆషా కార్యాలయంలో ఉదయం నుంచి అభిమానులు, పట్టణ ప్రముఖులు జూలియన్ రాజును కలిసి శాలువాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడామైదానం కావాలని వినతి



ప్రజాశక్తి-నాయుడుపేట: తమ గ్రామంలో క్రీడా మైదానం వాలని కోరుతూ బిరదవాడ గ్రామానికి చెందిన విద్యార్థులు, యువత సోమవారం తహశీల్దారు రాజేంద్రకు వినతిపత్రం అందించారు. వైసీపీ మండల కన్వీనర్ తమ్మిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, ప్రముఖ వైద్య నిపుణులు కేవీ రమణయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక పరిశీలన

ప్రజాశక్తి- దొరవారిసత్రం: జగనన్న విద్యాకానుకను సోమవారం తహశీల్దారు గోపిరెడ్డి ఏకోళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పరిశీలించారు. ఎంఈవో మస్తానయ్య, ఎంపీడీవో సింగయ్య, సీఆర్పీలు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: పుత్తూరు బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యాకానుక కిట్లను సోమవారం ఎంపీపీ మునివేలు పరిశీలించారు. ఎంఈవో తిరుమలరాజు, డీటీ స్వరూప రాణి, సీఆర్పీలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని సంజీవ్‌గాంధీలోని పాడుబడ్డ గృహంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న సెబ్ సీఐ ఆర్‌వీయూఎస్ ప్రసాద్ తన సిబ్బందితో పేకాట స్థావరంపై సోమవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న మద్దెల మల్లారావు,షేక్ నజీర్, అమాస విజయ్, అమాస చెంచయ్యలను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2700 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రీకాంత్, సెబ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు దళితుల సన్మానం

ప్రజాశక్తి-గూడూరు: బాలయపల్లి మండలంలోని 'గొట్టికాడు' గ్రామ దళితులకు సంబంధించిన భూమిని అదే గ్రామానికి చెందిన పెత్తందారులు ఆక్రమించుకొని దళితులను బెదిరించడంతో ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు స్పందనలో అర్జీలు అందించి వేడుకున్నారు. వెంటనే స్పందించిన ఆర్డీవో బాలాయపల్లి తహశీల్దారు తహశీల్దారుకు రెండు రోజుల్లో భూములు సర్వే చేసి వివరాలు అందించాలని సూచించారు. సర్వేలో పేదలకు చెందిన భూములే అని తేల్చడంతో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో గ్రామస్థులు గూడూరుకు చేరుకుని ఆర్డీవో కిరణ్ కుమార్‌ను శాలువతో ఘనంగా సన్మానించి 'మీ రుణం జన్మలో తీర్చు కోలేము' అంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్య క్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం బాలాయపల్లి మండల కార్యదర్శి గజ్జల రాజగోపాల్, రైతులు వసంత కుమార్, రమేష్, జయమ్మ, కాంతారావు, సుజాత, రాజేశ్వరి పాల్గొన్నారు.

అప్పలాయగుంట వాసులకు ఇంటి పట్టాలివ్వాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న అప్పలాయగుంట కాలనీ వాసులకు వెంటనే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద సీపీఎం, సిపిఐ ఆధ్వర్యంలో అప్పలాయగుంట వాసులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు గంధం మణి, జనమాల గురవయ్య మాట్లాడుతూ నిరుపేద పేద కుటుంబాలు గత 30 సంవత్సరాలుగా ఇల్లు నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నారని చెప్పారు. అయితే వారిని ఉన్నఫలంగా ఖాళీ చేయాలంటూ శ్రీకాళహస్తి రెవెన్యూ అధికారులు వేధించడం తగదన్నారు. వెంటనే వారికి ఇంటి పట్టాలు మంజూరు చేసి శాశ్వత ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు మార్గం సుగమం చేయాలని కోరారు. ఇదిలా ఉంటే ఐదు ఎకరాల విస్తీర్ణంలో కృష్ణయ్య అనే వ్యక్తికి పట్టా ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. 15 సంవత్సరాలు మించి అనుభవంలో వారికే చెందుతుందని కోర్టులు ఎన్నోసార్లు తీర్పులు ఇచ్చినా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. యశోద, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సురక్షితమైన ఆహారం అందించడమే ధ్యేయం

ప్రజాశక్తి-క్యాంపస్: దేశంలోనైనా, రాష్ట్రంలోనైనా వినియోగదారులకు సురక్షితమైన ఆహారం అందించడమే లక్ష్యంగా వ్యవసాయ పరిశోధనలు ముందుకు సాగాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో రెండు రోజుల జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినూత్న రీతిలో పరిశోధనలు కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు సురక్షితమైన ఆహార పదార్థాన్ని ఏ విధంగా ఉత్పత్తి చేయవచ్చునో వ్యవసాయ రైతులకు తమ సూచనలు, సలహాలు పూర్తిస్థాయిలో అందించాలన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సాధనలో ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం గణనీయమైన మైలురాలను సాధించి పెట్టిందన్నారు. రాష్ట్రంలోని వ్యవసాయ రంగంలో పలు రకాలైన సమస్యల పైన విషయవిద్యాలయం తన పరిశోధన రంగాలపై దృష్టి పెడుతుందన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్టడీస్ డాక్టర్ జి. రామారావు మాట్లాడుతూ 578 మంది పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులు వివిధ సమకాలీన అంశాలపై తమ పరిశోధనా పత్రాలను ఈ రెండు రోజుల సదస్సులో పత్ర సమర్పణ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఐసిఏఆర్ సంస్థల శాస్త్రవేత్తలు డాక్టర్ సి.బ్రహ్మానంద శ్రీనివాస్, డాక్టర్ పి. బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఎం. కష్ణారెడ్డి, ఇక్రిశాట్ డిడిజి డాక్టర్ బి.ఎస్ సొంటాగి, ఎస్ వి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డాక్టర్ అరవింద్ కుమార్, డాక్టర్ జి. ప్రభాకర్ రెడ్డి, ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం అధ్యాపకులు, వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం..!

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ బాలాజీ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం జాయింట్ కలెక్టర్ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. జిల్లా జాయింట్ కలెక్టర్, అడిషనల్ ఎస్పీ కులశేఖర్ ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు.

వెంకటగిరి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం కషి విజ్ఞాన కేంద్రం ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త గోవిందరాజులు ఆధ్వర్యంలో వెంకటగిరిలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మానవాళికి ముప్పు తెచ్చే ప్లాస్టిక్ ను వాడరాదని, పర్యావరణం సమతుల్యంగా ఉండాలంటే మొక్కలను నాటి వాతావరణ సమతుల్యతను పెంచాలన్నారు. అందులో భాగంగా కషి విజ్ఞాన్ కేంద్రంలో రైతులకు, రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ నాగన్న సాగర్ , కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త లు డాక్టర్ తిరుపాల్, నాగార్జున, రైతు భరోసా కేంద్ర సిబ్బంది, కోటేశ్వరరావు, గార్డులు, రైతులు పాల్గొన్నారు.

వెంకటగిరి : వెంకటగిరి పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో పర్యావరణ దినోత్సవ సందర్భంగా ప్లాస్టిక్ సంచుల నిషేధంపై మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటగిరి పట్టణంలో దుస్తుల దుకాణాల యజమానులతో ప్లాస్టిక్ సంచుల నిషేధంపై సహకరించాలని అవగాహన కల్పించారు. ప్రతి దుకాణం ఎదుట ప్లాస్టిక్ సంచులు నిషేధించడమైందని బోర్డులు పెట్టాలని కమిషనర్ ఆదేశించారు.

తొట్టంబేడు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్‌వీపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పర్యావరణహిత జీవనశైలిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీ క్షేత్ర అధికారి లోకేష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప అటవీక్షేత్రాధికారి రామకష్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మురళి, అధ్యాపకులు డాక్టర్ నరసింహవర్మ, డాక్టర్ ఆర్. చంద్రమౌళి, ఓ.పి ప్రసాద్, ఎం.తులసి, పరందామయ్య, ఫారెస్ట్ బీటు అధికారులు, వాచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాంపస్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం శ్రీపద్మావతి జూనియర్, డిగ్రీ కళాశాలల ఆవరణలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమానికి టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ ఎమ్.భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ 1974లో ఐక్యరాజ్యసమితి మొదటిసారి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఆచరించిందన్నారు. రాబోయే తరాలకు అందమైన, ఆరోగ్యకరమైన సంతోషకరమైన జీవితాన్ని గడపడానికి మొక్కలు నాటడం ప్రతి పౌరుడి బాధ్యత అని చెప్పారు. భూమి మన ఇల్లు లాంటిదని, దాన్ని శుభ్రంగా ఆకు పచ్చగా ఉంచడానికి మొక్కలు నాటి, నీరు పోస్తూ వాటిని కాపాడాలని ఆయన వివరించారు. టీటీడీ విద్యా సంస్థలను ప్లాస్టిక్ నిషేధిత ఆవరణముగా ఉంచుకోవాలన్నారు.

పుత్తూరు టౌన్: పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ సోమవారం పుత్తూరు మున్సిపల్ కమిషనర్ కెవెల్ ఎన్ రెడ్డి, ఛైర్మన్ ఆనంగి హరి పుత్తూరులో ర్యాలీ చేపట్టారు. అనంతరం రెండోవార్డులోని శ్మశానవాటిక ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి శంకర్, వార్డ్ కౌన్సిలర్లు నర్సింహులు, ఏకాంబరం, భానుమతి, చక్రి, పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: పర్యావరణం దారుణంగా దెబ్బతింటోందని.. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ సహకారం అందించాలని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసన్‌రెడ్డి సూచించారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం ర్యాలీని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాయి వెంకటేష్, ఎకోక్లబ్ కన్వీనరు ఎస్. పద్మావతి, నరసింహులు, శాంసన్, హరిబాబు విద్యార్థులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: జాతీయ స్థాయిలో గూడూరు హాకీ క్రీడాకారులు ప్రత్యేక స్థానం కలిగి ఉండటం సంతోషకరమని శాప్ కోచ్ దీపు అన్నారు. అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో సీనియర్ హాకీ క్రీడాకారుల ఆధ్వర్యంలో పేటేటి సత్యంనాయుడు ట్రస్ట్ సహకారంతో గత నెల రోజులుగా జరుగుతున్న వేసవి హాకీ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో క్రికెట్ కోచ్ లవకుమార్, సీనియర్ హాకీ క్రీడాకారులు అశోక్, మస్తాన్ సుధాకర్, అనిల్, ధనుంజయ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు అనుబంధం రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రచార జాత సోమవారం పుత్తూరుకు చేరుకుని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేంద్రబాబు, జిల్లా కార్యదర్శి వెంకటేష్, గోపి, నాగరాజు, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

గజ వాహనంపై శ్రీనివాసుని విహారం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి 7 గంటలకు శ్రీ రాజమన్నార్ అలంకారంలో స్వామి వారు గజవాహనంపై భక్తులను కటాక్షించారు. నిద్ర లేవగానే ఐశ్వర్యానికి ప్రతీక అయిన ఏనుగును దర్శించడంతో భోగభాగ్యాలు అభివృద్ధి కలుగుతాయి. వాహనసేవలో డెప్యూటీ ఈవో గోవింద రాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ వాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: దేవరకొండ, చిట్టేచెర్ల పంచాయతీల్లో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపట్టిన ఉచిత వైద్యశిబిరాన్ని సోమవారం ఎంపీపీ యుగంధర్‌రెడ్డి ప్రారంభించారు. సుమారు రెండువేల మంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. కార్యక్రమంలో డి ఎల్ డి ఓ సుశీల దేవి,తుడా సెక్రెటరీ లక్ష్మీ ,తహసిల్దార్ లోకేశ్వరి, ఎంపీడీవోలు దేవేంద్రబాబు, అమర్నాథ్, అధికారులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, తాగునీరు, మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ ఆధ్వర్యంలో ఆర్ఎంవోకు వినతిపత్రం అందించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి.హెచ్.ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్, చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్ , ఏ.ఐ.టి.యు.సి నియోజకవర్గ కార్యదర్శి బేటి చంద్రయ్య, ఇన్సాఫ్ రాష్ట్ర నాయకుడు జమాలుల్లా , హేమంత్ తదితరులు పాల్గొన్నారు.